# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
# విశాఖపట్నం కేంద్రం
# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-04-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాబోయే పదేళ్లలో దేశంలో డిజిటల్ లావాదేవీలు మరింతగా పెరగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షించారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర శ్రీ సత్య సాయి జిల్లాలో కొనసాగుతోంది.
- పోస్టల్ బ్యాలెట్లను జారీ చేసే విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలను అనుసరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను కోరారు.
- రాష్ట్రంలో పలు జిల్లాలలో గరిష్ట ఉష్ణో గ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.
- రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపధ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

==============================

రాబోయే పదేళ్లలో దేశంలో డిజిటల్ లావాదేవీలు మరింతగా పెరగాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆకాంక్షించారు. ఏప్రిల్ 1, 2024తో భారతీయ రిజర్వు బ్యాంక్ 90వ సంవత్సరం లోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ, దేశంలో నగదు రహిత ఆర్ధిక వ్యవస్థ వల్ల వస్తున్న పరిణామాలపై నిఘా ఉంచాలని సూచించారు. భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత బలమైన, స్థిరమైన వ్యవస్థగా పరిగణించబడుతుందని గుర్తు చేశారు. దేశ వృద్ధికి అవసరమైన చర్యలను ఆర్బీఐ తీసుకోవాలని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

==============================

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఐదో రోజు అయిన ఈ రోజు శ్రీసత్యసాయి జిల్లా సంజీవపురం నుంచి ప్రారంభమైంది. బత్తపల్లి, రామాపురం, మలకవేముల మీదగా పట్నంకు బస్సు యాత్ర సాగింది. ఈ బస్సు యాత్రలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

==============================

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ తో పాటు, ఇంటి నుంచే ఓటింగ్ చేసే వారి కోసం స్పష్టమైన మార్గదర్శకాలను అనుసరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను కోరారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి దృశ్య మాధ్యమం ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్, మే నెలలలో తేదీల వారీగా కార్యక్రమాలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఇందుకోసం వారికి అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సీఈవో ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

==============================

రాష్ట్రంలో పలు జిల్లాలలో గరిష్ట ఉష్ణో గ్రతలు రెండు మూడు డిగ్రీల సెంటి గ్రేడ్ వరకు క్రమంగా పెరిగే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఆంధ్ర ప్రదేశ్ లో దిగువ ట్రోపో ఆవరణములో ఆగ్నేయ , నైరుతి దిశ గా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. దీని ప్రభావంతో రాయలసీమలో గరిష్ట ఉష్ణో గ్రతలు 2 నుండి 4 డిగ్రీల సెంటి గ్రేడ్ వరకు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఇదిలా ఉండగా రానున్న మూడు రోజులలో అనేక జిల్లాలలో పగటి ఉష్ణోగ్రతలు మరింతగా పెరగనున్నాయని పేర్కొంది. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాలో 40 నుంచి 44 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకోవచ్చునని వివరించింది. అలాగే గోదావరి జిల్లాలతో పాటు కోస్తా జిల్లాలలో కూడా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని వెల్లడించింది. కొన్ని చోట్ల వడ గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని సూచించింది.

==============================

రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్ రెడ్డి అధికారులను కోరారు. రాష్ట్రంలో వడగాల్పులు. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ, ఫించన్ల పంపిణీ అంశాలపై ఈ రోజు వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్.రావత్,జలవనరులు, పిఆర్ అండ్ ఆర్డిశాఖల ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విరామం

==============================

దేశంలో చమురు కంపెనీలు 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరపై రూ. 30.50 రూపాయలు తగ్గించాయి. దీంతో దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం వాణిజ్య సిలెండర్ ధర రూ. 1,764.50 గా ఉంది. అలాగే 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ ధర కూడా రూ. 7.50 తగ్గింది.. కాగా ఆంధ్ర ప్రదేశ్ లో వాణిజ్య సిలిండర్ ధర 1,858.50 రూపాయలుగా గృహ వినియోగ సిలిండర్ ధర 811 రూపాయలుగా వుంది. తగ్గిన ధరలు ఈ రోజు నుంచి అమల్లోకి వస్తాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గుంటూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసినట్లుగా జిల్లా కలెక్టర్ ఎమ్.వేణుగోపాలరెడ్డి తెలిపారు. ఈ నెల 18 న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 17 లక్షల 69 వేల 315 మంది ఓటర్లు తమ ఓటుహక్కును ప్రశాంతంగా వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లుగా వివరించారు. ఎన్నికల నియమావళిని అమలుచేయటానికి 27 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు, 63 ఫ్లైయింగ్ స్క్వాడ్ లు ఏర్పాటుచేశామని వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విశాఖ జిల్లాలో సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం సింహాచలంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహాయజ్ఞం ఈ రోజుతో ముగిసింది. మార్చి 26 నుంచి మొదలయిన సుదర్శన నారసింహ మహాయజ్ఞం మహాపూర్ణాహుతి తో పూర్తి అయింది. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు తరలి వచ్చారు. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా వైదికులు హోమాలతో పాటు హవనం జరిపించారు. కార్యక్రమాలలో ఆలయ అనువంశిక ధర్మ కర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, పీఠాధిపతులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి వివిధ రాజకీయ పార్టీల ప్రచార వ్యయాన్ని పక్కాగా లెక్కించాలని పశ్చిమగోదావరి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన ఎన్నికల వ్యయంపై జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం ఈ రోజు భీమవరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎలక్ట్రానిక్, ప్రింట్, కేబుల్ సోషల్ మీడియాతో పాటు, బహిరంగ సభలు, ర్యాలీలు ద్వారా నిర్వహించే ప్రచారాలు, వాహనాల ఖర్చుల వంటివి సక్రమంగా లెక్కించాలని అధికారులను కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాపట్ల జిల్లా చీరాల 216వ జాతీయ రహదారి పై ఈ రోజు జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యవసాయ కూలీలు గాయపడగా ఒక కూలి మృతి చెందిందని, పోలీసులు తెలిపారు. వేటపాలెం మండలం అక్కాయపాలెం నుండి పాపాయిపాలెం కు వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ కూలీలతో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. కాగా, ప్రమాదంలో గాయాలపాలైన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ప్రమాద ఘటన పై పోలీసులు విచారణ చేపట్టారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిర్దేశిత లిఖిత పూర్వక అనుమతులు పొందిన సిబ్బందికే పోస్టల్ బ్యాలెట్లు అందచేయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఈ రోజు ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ , పోస్టల్ బ్యాలెట్ పంపిణీ కోసం అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. అదేవిధంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలలో 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజ నులు, మంచానికి పరిమితమై నడవలేని స్థితిలో ఉన్న వారు, దివ్యాంగులను బిఎల్వోలు సహకారంతో గుర్తించి వారికి ఇంటి నుండే ఓటు వేసే విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =